

# పుస్తక పరిచయం







'చైనా జపాన్‌లాటి దేశాలకు వెళ్ళినప్పుడు మనం ఎలా ప్రవర్తించాలో ఎలా ప్రవర్తించకూడదో, ఏం చెప్పాలో ఏం చెప్పకూడదో నేర్పే సెమినార్లు చాల వున్నాయి అమెరికాలో. మరి ఇండియానించీ నెలనెలా కొన్ని వేలలో దిగుమతవుతున్న భారతీయులకి, ముఖ్యంగా తెలుగువారికి అమెరికా జీవితం సవ్యంగా గడపటానికి కావలసిన విషయాలపై సమాచారం ఇచ్చేవారు నాకంతగా కనపడలేదు. చుట్టం చూపుగా వచ్చేవాళ్ళకి ఫరవాలేదు ఎవరో ఇక్కడ సహాయం చేస్తారు. చదువుకోటానికి వచ్చేవాళ్ళూ ఉద్యోగాలకి వచ్చే వాళ్ళు  మొదట్లో నానా బాధలూ పడటం చూస్తున్నదే. అలాటివి నాలుగైదు వ్యాసాల్లో వ్రాసి ఆంధ్రభూమి వారపత్రికకి పంపించాను. ఎయస్‌లక్ష్మిగారవి ప్రచురిస్తాను కానీ, నాలుగైదులా కాదు ఒక శీర్షికలా వారపత్రికలో నడుపుదామని ఉత్తరం వ్రాశారు. ఇక్కడ ఆఫీసు పనితోనూ, తత్సంబంధమైన ప్రయాణాలతోనూ, నేను నడుపుతున్న తెలుగు స్కూలు పనితోనూ, కథా వ్యాసాంగంతో అప్పటికే ఎన్నో గంటలు పనిచేస్తున్న నాకది జరిగే పనిలా కనిపించలేదు. అదే వ్రాశాను. కానీ పట్టు విడవని లక్ష్మిగారు, మీరు కనీసం పది వ్యాసాలు వ్రాసేదాకా ఆగి, అప్పుడు ప్రచురణ మొదలుపెడతాను, దానితో మీకు సమయమూ సరిపోతుంది, వెసులుబాటూ అవుతుంది అని మొహమాట పెట్టారు. అలా మొదలయినాయి ఈ ఎన్నారై కబుర్లు. అలా ఈ వ్యాసాలు నాలుగున్నర సంవత్సరాల పైగా వారం వారం వ్రాశాను' అని రచయిత సత్యం మందపాటి పరిచయంలో వ్రాశారు.

ఇలాటి శీర్షిక నాలుగున్నర సంవత్సరాలు వ్రాయటం, ఈ శీర్షిక ఆపేసిన తర్వాత పాఠకులు నిరుత్సాహపడి ఉత్తరాలు వ్రాయటం చూస్తే, ఈ వ్యాసాలు ఎంతగా పాఠకులని ఆకట్టుకున్నాయో అర్థమవుతుంది. అంతేకాక ప్రచురించిన 15 నెలలలోనే, ఈ రెండు పుస్తకాలూ రెండవ ముద్రణ అవటం, ఈ ఎన్నారై కబుర్లు పాఠకులకు ఎంతగా నచ్చాయో తెలుస్తున్నది.

'ఈ శీర్షిక కింద ఆయన చెప్పినవి కాలక్షేపం కబుర్లు కావు. ఒట్టి మాటలూ కావు. చాలా కాన్ఫిడెన్స్‌తో చెప్పిన గట్టి మాటలు. వాటిలో వింతలూ విశేషాలూ ఉంటాయి. రచయితగా సత్యంగారి అనుభవాలూ, అనుభూతులూ ఉంటాయి. కొత్త ఆలోచనలుంటాయి. ఒక అనుభవజ్ఞుడి స్వగతంలా ఉంటాయి.  మారుతున్న సాంస్కృతిక, సామాజిక, రాజకీయ పరిస్థితుల

అవలోకనంతోపాటు, విదేశాల్లో ఉంటున్న భారతీయుల మనస్తత్వ చిత్రణనీ సత్యంగారు అలవోకగా చేయగలిగారు. పాఠకులకి ఇంకా ఎన్నో విషయాలమీద కుతూహలం రేకెత్తించగలిగారు. అందుకు కారణం ఆయన శైలి. ఆయన చెప్పే ఏ కబురూ మరో కబురులా వుండదు. ఓసారి ఆప్తమిత్రుడిలా మనసులో మాటలు పంచుకుంటున్నట్టు ఉంటే, మరోసారి మాస్టారి అవతారమెత్తి పాఠం చెబుతున్నట్టు ఉంటుంది. ఒకసారి ప్రపంచాన్ని చూసి పరిహాసం చేస్తున్నట్టు తోస్తే, ఇంకోసారి మనని చూసి మనమే నవ్వుకోగలిగేట్లు చేస్తుంది. ఏ రకంగా చూసిన ఈ ఎన్నారై కబుర్లలో రచయిత హాస్యప్రియత్వం, సహృదయం స్పష్టంగా కనిపిస్తుంటాయి. నిష్టూరంగా ఉండే నిజాలనైనా సత్యంగారు నొప్పించకుండా తమాషాగా చెబుతారు. 'ఎన్నారై కబుర్లు' చదివాక ఈ మాట మీరూ అంటారు' అని తన ముందుమాటలో వ్రాశారు ఆంధ్రభూమి వారపత్రిక న్యూస్ ఎడిటర్ ఎ.ఎస్.లక్ష్మి.

'అమెరికాలో ఐదేళ్ళుండి వెనక్కి వచ్చేస్తాం!'

'ఉన్న ఇద్దరు పిల్లలనీ పరదేశానికి అర్పించి, ఈ వయసులో ఒంటరిగా ఇక్కడే కాలం వెళ్ళబుచ్చుదామను కుంటున్నాం. మనవలూ మనవరాళ్ళూ పుడితే, ఓపిక వుంటే ఆరు నెలలుండి వస్తాం. లేదా వాళ్ళతో ఫోన్‌లోనే మాటామంతీ. మాకిక్కడ రోగమొచ్చినా రొష్టు వచ్చినా మేమిద్దరమే ఒకళ్ళకొకళ్ళం, ఎవరూ లేనివాళ్ళలా!'

'నాకు ఆరు నెలల వీసా ఇచ్చారు. ఇండియాలో నాకు రిటైర్మెంట్‌కి ఇంకా నాలుగేళ్ళుంది. ఇక్కడ ఏదన్నా మంచి ఉద్యోగం దొరికితే అమెరికాలోనే వుండి పోదామని వుంది. నా చదువూ క్వాలిఫికేషన్‌లూ మీకు తెలుసు. నాకెక్కడయినా మంచి ఉద్యోగం వస్తుందంటారా? మీరేమయినా సహాయం చేయగలరా?'

ఇలాటి ఎన్నో విషయాల గురించి మనకి రకరకాల కబుర్లు వున్నాయి ఈ రెండు పుస్తకాల్లోనూ.

'ముళ్ళపూడి ఊరికే అన్లేదు, నిజంగా మందపాటి సత్యానిది 'ఇన్ఫోటైన్ మెంటాలిటీ'. సమాచారాన్నీ, సరదానీ మేళవించి; అదే సమయంలో బాధ్యతలనూ కర్తవ్యాలనూ గుర్తు చేస్తూ, సలహాలనూ సంప్రదింపులనూ అందిస్తూ, ఈ ఎన్నారై కబుర్లను కేవలం 'డయాస్పొరా' సాహిత్యంగానే కాక, అమెరికా రాగోరేవారికీ, వచ్చి వుండగోరేవారికీ ఒక కరదీపికగా, హితవరిగా సంతరించారు'

'అమెరికా వెళ్లినా వెళ్లక పోయినా ఇండియాలోని ప్రతివారూ ఓసారి ఈ ఎనారై కబుర్లు చదివి తీరాలి. అమెరికా తెలుగువారూ విధిగా ఈ కబుర్లు తమ అనుభవాలతో కలిపి కలబోసుకోవచ్చు. వెరసి ఇది ఉపయుక్తమైన మాటామంతీ. ఒక మంచి పరామర్శ గ్రంథం. కథకుడిగా ప్రసిద్ధుడైన మందపాటి సత్యం ఈ కబుర్ల ద్వారా ఒక ఇష్టుడైన కాలమిస్టుగా, హ్యూమనిస్టుగా, తనదైన హ్యూమరిస్టు పంథాలో పాఠక జన హృదయాలను నిస్సందేహంగా అలరించగలడు' అంటారు ప్రముఖ సమీక్షకుడు సుధామ.

ఏది ఏమైనా ఇవి రెండూ తప్పక చదవి, దాచుకోవలసిన మంచి పుస్తకాలు.

**ప్రచురణ:** **కాపీలకు: telugu_books@yahoo.com**

**సాహితీ సౌరభం,** **www.satyam-mandapati.com**

**హైద్రాబాద్, గుంటూరు.** **పుస్తక పరిచయం చేసినది - ఆదిత్య**

---

ఈ శీర్షికలో తమ పుస్తక పరిచయాలు ప్రచురింపబడాలనుకునే వారు, తమ పుస్తకాలు ఒక్కొక్క కాపీని క్రింది ఎడ్రసుకి మెయిల్ చెయ్య వలసిందిగా 'కౌముది' విజ్ఞప్తి చేస్తోంది.

**Editor**
**KOUMUDI(Web Monthly)**
**4251 Escudo Ct**
**Dublin, CA 94568,USA**